స్వాట్ ఏర్పాటు మా సర్కార్ ఘనత: సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా నిరసనకారుల హక్కులకు భంగం కలగకుండా వారిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'స్వాట్' విభాగం తమ ప్రభుత్వ ఘనతని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. " ప్రజాస్వామ్య స్ఫూర్తితో.. సరికొత్త ఆలోచన...మహిళా పోలీసులతో స్వాట్ ఏర్పాటు. నిరసనను పరిగణిస్తాం...నినాదాన్ని అలరిస్తాం... ఆవేదనను పరిష్కరిస్తాం....ఆడబిడ్డను గౌరవిస్తాం" అని సిఎం పేర్కొన్నారు.

మీరు..భారతదేశ భవిష్యత్ రూపశిల్పులు

- సివిల్ సర్వీసెస్ అభ్యర్థులతో గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన మీరు భారతదేశ భవిష్యత్‌కు రూపశిల్పులని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో యుపిఎస్‌సి 2024లో వివిధ విభాగాలకు ఎంపికైన అభ్యర్థులు గవర్నర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, సంకల్పం ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించారని కొనియాడారు. విధి నిర్వహణలో వినయం, సమగ్రత, కరుణతో సేవ చేయాలని సూచించారు. అనంతరం వారిని గవర్నర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం దాన కిషోర్, సీనియర్ అధికారులు, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఓవర్సీస్ స్కాలర్ షిప్పులు

- దరఖాస్తు తుది గడువు జూన్ 30

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీలు సిఎం ఓవర్సీస్ స్కాలర్ షిప్‌ల కోసం దరఖాస్తు చోసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మీన్ బాషా కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తులు సమర్పించేందుకు తుది గడువు జూన్ 30తో ముగుస్తుందని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన కొన్ని విదేశాల యూనివర్సిటీల్లో విద్యనభ్యసించేందుకు ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనం ఇస్తున్న సంగతి తెలిసిందే. మరిన్ని వివరాల కోసం ఝఝఝ.ఙ్రీఖఅస్త్రుఖువజూఖం.ప్రశీజ.ఱఅలో చూడొచ్చు.

18 నుంచి టెట్ రాతపరీక్షలు

- 30 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజిటెట్) రాతపరీక్షలు ఈనెల 18 నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం కానున్నాయి. ఈనెల 30 వరకు జరుగుతాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈవి నరసింహారెడ్డి బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. తొమ్మిది రోజులపాటు 16 విడతల్లో టెట్ రాతపరీక్షలు జరుగుతాయని వివరించారు. ప్రతిరోజూ రెండు విడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. టెట్ రాతపరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా పేపర్-1కు 63,261 మంది, పేపర్-2కు 1,20,392 మంది కలిపి మొత్తం 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

హామీ ఏం రాలే...

- డిఎలు, పెండింగ్ బిల్లులు, పిఆర్‌సి, సిపిఎస్ రద్దుపై స్పష్టత లేదు
- నేటి మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తాం : భట్టి
- ప్రభుత్వంపై మాకు నమ్మకముంది
- ఉద్యోగ జెఎసి చైర్మన్ జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యోగ జెఎసి నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు అధికారుల కమిటీ సభ్యులూ పలుమార్లు సమావేశాలను నిర్వహించారు. సమస్యలు వినడమే తప్ప అవి పరిష్కారం కావడం లేదు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉద్యోగ జెఎసితో సమావేశాన్ని నిర్వహించారు. సుమారు రెండుగంటలపాటు సమస్యలపై మళ్లీ చర్చించారు. ఉద్యోగ జెఎసి నాయకులు మరోసారి సమస్యల గురించి వివరించారు. కానీ మంత్రివర్గ ఉపసంఘం సమస్యలకు సంబంధించి ఎలాంటి హామీ ఇవ్వకపోవడం గమనార్హం. రాష్ట్రంలో ఐదు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఎన్ని డిఎలను ప్రభుత్వం ప్రకటిస్తుందో స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సుమారు రూ.11 వేల కోట్లు వివిధ రకాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఎలా విడుదల చేస్తారో, ఎప్పటిలోగా చెల్లిస్తారో ప్రకటించలేదు. 2023, జులై ఒకటి నుంచి పిఆర్‌సి అమలు కావాలి. ఆ నివేదిక ఎప్పుడు వస్తుందో, ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా ప్రకటించలేదు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను అమలు చేస్తామంటూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దానిపైనా ఎలాంటి హామీ ఇవ్వలేదు. ఆర్థిక సమస్యలతోపాటు ఆర్థికేతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం నుంచి హామీ రాలేదు. ఉద్యోగుల సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉందనీ, వాటిని గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న హామీని మాత్రమే భట్టి విక్రమార్క ఇవ్వడం గమనార్హం. దీంతో ఉద్యోగ సంఘాల నాయకులు కొంత అసంతృప్తికి గురయ్యారు. కనీసం డీఏల గురించైనా స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఈ సమావేశాన్ని నిర్వహించడంలో ఆంతర్యమేంటో అర్థం కాలేదంటూ వారు అసహనం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీ, ఉద్యోగ జెఎసి సమావేశాన్ని నిర్వహించారు. ఉప



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి

ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, అధికారుల కమిటీ చైర్మన్, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, సిసిఎల్ఎ నవీన్ మిట్టల్, సభ్యులు లోకేష్‌కుమార్, కృష్ణభాస్కర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జిఎడి ముఖ్యకార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, ఉద్యోగ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, కో చైర్మన్లు చావ రవి, జి సదానందంగౌడ్, వంగ రవీందర్‌రెడ్డి, పి మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ పుల్గం దామోదర్‌రెడ్డి, ముజీబ్ హుస్సేనీ, ఎ సత్యనారాయణ, నాయకులు ఎ వెంకట్, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, బి శ్యామ్, సిహెచ్ అనిల్‌కుమార్, తరాల జగదీశ్, కృష్ణయాదవ్, సి జగదీశ్, ఎండీ అబ్దుల్లా, మణిపాల్‌రెడ్డి, యాదగిరి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాబినెట్‌లో నివేదిక సమర్పిస్తాం... పరిష్కారం కనుగొంటాం : భట్టి

ఉద్యోగుల సమస్యల పరిష్కారం తమ బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఉద్యోగుల సమస్యలపై గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో నివేదికను సమర్పిస్తామనీ, పరిష్కారం కనుగొంటామని చెప్పారు. సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలనే మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీని సిఎం రేవంత్‌రెడ్డి నియమించారని గుర్తు చేశారు. సమస్యలపై అందరితో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొన్నేండ్లుగా బకాయిలు పేరుకుపోవడంతో అన్ని ఒకేసారి చేయలేకపోయామని అన్నారు. ఎక్కువ కాలం వాటిని పెండింగ్‌లో ఉంచకుండా, పరిష్కారం చూపాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని వివరించారు. సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచనలో భాగంగానే మొదటి తారీఖున జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. వనరులు సమకూర్చుకుని ప్రజలపై అదనంగా ఒక్క రూపాయి భారం పడకుండా ముందుకుపోతున్నామని వివరించారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నామని అన్నారు. ఉద్యోగుల కుటుంబాల్లో పెండ్లీలు, ఆస్పత్రుల ఖర్చులకు సంబంధించిన సమస్యలపై మంత్రివర్గ సహచరులతో అంతర్గతంగా పలుమార్లు చర్చించుకున్నామని వ్యాఖ్యానించారు. అధికారుల కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదికను రూపొందించి మంత్రివర్గ సమావేశంలో నివేదిస్తామని వివరించారు.

వయో పరిమితి పెంపు లేదు : ఉద్యోగ జెఎసి

రాష్ట్రంలో ఉద్యోగుల వయో పరిమితి పెంపు లేదనీ, ప్రభుత్వంలో ఎక్కడా ఆ చర్చ జరగలేదని ఉద్యోగ జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మీడియాతో చెప్పారు. వయోపరిమితి పెంపును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. 57 డిమాండ్లలో 12 ఆర్థికపరమైనవి, 45 ఆర్థికేతర సమస్యలున్నాయని వివరించారు. ప్రభుత్వంపై తమకు పూర్తి నమ్మకముందనీ, త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. గురువారం జరిగే మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని అన్నారు. ఒకవేళ సమస్యలను పరిష్కరించకుంటే కార్యాచరణ చేపడతామన్నారు. దశలవారీగా ఆందోళనలు చేపడతామని చెప్పారు.

వృద్ధ రైతును మెడపట్టి గెంటేసిన ఎఎస్ఐ

- సస్పెండ్ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ భారతి రెవెన్యూ సదస్సులో ఓ వృద్ధుడికి చేదు అనుభవం ఎదురైంది. ఎఎస్ఐ అత్యుత్సాహం ప్రదర్శించి వృద్ధుడిని మెడ పట్టి బయటకు గెంటేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్‌లో బుధవారం జరిగింది. ప్రభుత్వం రైతుల కోసం భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు ప్రతిష్టాత్మకంగా చేపట్టినన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం పాత ఎల్లాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. వృద్ధ రైతు అల్లెపు వెంకటి అధికారుల వద్దకొచ్చి.. అధికారులే పొరపాటు చేసి.. తన భూమిని తన పేరున పట్టా చేయడం లేదు.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన భూమి తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని పట్టుబట్టాడు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎఎస్ఐ రాంచందర్ వృద్ధ రైతును బయటకు రమ్మని అనడంతో.. 'మధ్యలో నీ రుబాబు ఏందని' ఆ రైతు ఎఎస్ఐని ప్రశ్నించాడు. దీంతో సహనం కోల్పోయిన ఎఎస్ఐ వృద్ధ రైతుడిని మెడ పట్టుకొని బయటకు గెంటేశాడు. ఈ ఘటనతో అక్కడున్న వారు అవాక్కయ్యారు. ఎఎస్ఐపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవ్వడంతో ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. ఎఎస్ఐ రాంచందర్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామని తెలిపారు.

డిజిపి చర్యలు తీసుకోవాలి : మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: ఖానాపూర్‌లో వృద్ధ రైతుపై పోలీసు చేయి చేసుకోవడం, మెడపట్టి బయటకు గెంటేయడం దారుణమంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తన సమస్యను చెప్పుకునేందుకు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన రైతు పట్ల ఇంత కర్కశంగా వ్యవహరించడమేంటని నిలదీశారు. సిఎం ఆదేశాలతో ఇంత అత్యుత్సాహం ప్రదర్శించడం పోలీసులకు అవసరమా? గతంలో లగచర్ల లంబాడి రైతన్నల చేతులకు బేడీలు వేశారు? ఇప్పుడు ఖానాపూర్‌లో వృద్ధ రైతు మెడలు పట్టి గెంటేశారు? రైతుల పట్ల ఇలా వ్యవహరించడమేంటి? ఇదేనా ప్రజా పాలన? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎద్దేడ్చిన ఎవుసం, రైతేడ్చిన రాజ్యం బాగుపడదన్న సంగతి మరిచిపోయి ఇంత క్రూరంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ దుశ్చర్యను ఖండించారు. రైతుపై చేయి చేసుకున్న పోలీసుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిజిపి జితేందర్‌ను కోరారు. ఈ ఘటనపై బేషరతుగా యావత్ తెలంగాణ రైతు లోకానికి కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇళ్లు

- ఏదులాపురం మున్సిపాలిటీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అర్హులైన నిరుపేదలకు దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలోని టిసివి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. పేద ప్రజల సొంతింటి కల సాకారం కోసం రూ.22,500 కోట్లను ప్రజా ప్రభుత్వం ఈ ఏడాది కేటాయించిందని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా పేదల సంక్షేమమే ఏజెండాగా పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తోందని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, చెంచులకు పూర్తి స్థాయిలో మంజూరు చేస్తున్నట్టు వివరించారు.

రేపే లాసెట్ పరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ రాతపరీక్ష శుక్రవారం ఆన్‌లైన్‌లో జరగనుంది. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాసెట్ రాతపరీక్షలకు మూడేండ్ల లా కోర్సుకు 41,210 మంది, ఐదేండ్ల లా కోర్సుఉ 11,695 మంది, ఎల్ఎల్ఎంకు 4,810 మంది కలిపి 57,715 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వారి కోసం మొదటి, రెండో విడత పరీక్షలను నిర్వహించేందుకు 76 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మూడో విడత పరీక్ష నిర్వహణ కోసం 65 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మూడేండ్ల లా కోర్సులో ప్రవేశాల కోసం మొదటి విడత ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఐదేండ్ల లా కోర్సు, ఎల్ఎల్ఎంలో ప్రవేశాల కోసం మూడో విడత పరీక్షను సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు జరుగుతుందని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లను https://lawcet.tgche.ac.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సచివాలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏప్రిల్, మే జీతాలివ్వండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సచివాలయంలో జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు (డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు) పెండింగ్‌లో ఉన్న ఏప్రిల్, మే నెల జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వెంకటేష్, జె.కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి జె.కుమారస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె వెంకటేశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఎస్‌కు అభినందనలు తెలిపారు. తెలంగాణ సచివాలయంలో సాధారణ పరిపాలనా శాఖలో 100 మందికి పైగా అవుట్ సోర్సింగ్ పద్ధతిన 20 ఏండ్లుగా ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. ఈ సిబ్బందికి 2025 ఏప్రిల్ నెల జీతం నేటికీ విడుదల కాలేదనీ, మే నెల జీతం కూడా విడుదల కావాల్సి ఉందని తెలిపారు. ప్రతినెలా వేతనాలు ఆలస్యంగా ఇస్తుండటంతో వారి కుటుంబాలు గడవటం కష్టంగా మారిందని వాపోయారు. వారి వేతనాలు ఇచ్చేలా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

పనులు పూర్తయ్యేది ఎప్పుడో?

- మామునూరు ఎయిర్‌పోర్ట్ పనుల్లో తీవ్ర జాప్యం
- పరిహారంపై మౌనం..
- భూసేకరణ, రోడ్లు, చెరువు పునరుద్ధరణకు రూ.350 కోట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్ట్ పనుల్లో తీవ్ర జాప్యం నెలకొంది. ఇక పనులు ప్రారంభమవుతాయని భావిస్తున్న తరుణంలో రైతులకు నష్టపరిహారంపై తుది నిర్ణయం తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండటం సందేహాలకు తావిస్తోంది. తాజాగా ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హన్మకొండ కలెక్టరేట్‌లో ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, వానాకాలం సాగు సన్నద్ధంతోపాటు మామునూరు ఎయిర్‌పోర్ట్ భూసేకరణ, పనులపై కూడా సమీక్షించాల్సి ఉంది. ఎ జెండాలోని అన్ని అంశాలను సమీక్షించిన మంత్రి మామునూరు ఎయిర్‌పోర్ట్ అంశాన్ని మాత్రం పక్కనపెట్టేశారు. దాంతో ఎయిర్‌పోర్ట్ భూసేకరణలో మరింత జాప్యం జరిగే అవకాశాలున్నాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ మౌనంగా ఉండటం గమనార్హం.

మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు 949.14 ఎకరాలు అవసరం అయితే 696.14 ఎకరాలు ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా



(ఏఏఐ) పరిధిలో ఉంది. మరో 253 ఎకరాలను సేకరిస్తే పెద్ద ఎయిర్‌క్రాఫ్ట్ నడిపే అవకాశముంటుంది. కాగా, దానికోసం సర్వేను ఇప్పటికే పూర్తి చేశారు. దీనికి అధికారులు ఎకరాకు నిర్ణయించినట్టు సమాచారం. కాగా, ఖిలావరంగల్ మండలంలోని నక్కలపల్లి, గాడిపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ భూమిని సేకరించడానికి నిర్ణయం తీసుకున్నారు. నక్కలపల్లిలో 51.20 ఎకరాలు, గాడిపల్లిలో 197.20 ఎకరాలను సేకరించాల్సి ఉంది. 21.23 శిఖం భూములు అందుబాటులో ఉన్నాయి. నక్కలపల్లికి చెందిన 63 మంది రైతులు, గాడిపల్లికి చెందిన 252 మంది రైతులు మొత్తంగా 315 మంది రైతుల భూములను రెవెన్యూ అధికారులు సేకరించడానికి సర్వే నిర్వహించారు. రైతుల డిమాండ్ మేరకు తుది ధరను నిర్ణయించడంలో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. వ్యవసాయ భూములకు సంబంధించి నక్కలపల్లి గ్రామంలో రిజిస్ట్రర్ లెక్కల ప్రకారం ఎకరాకు 15.3 లక్షలు కాగా, గాడిపల్లిలో ఎకరాకు రూ.12.34 లక్షలుగా వుంది. జిల్లా కలెక్టర్ సత్యశారద పర్యవేక్షణలో వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, ఖిలావరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావు క్షేత్రస్థాయిలో ఎంజాయ్‌మెంట్ సర్వేను పూర్తి చేశారు.

ధరలపై గందరగోళం..

మామునూరు ఎయిర్‌పోర్ట్ భూ సేకరణలో నక్కలపల్లి, గాడిపల్లి గ్రామాలకు చెందిన 253 ఎకరాల భూ సేకరణకు సంబంధించి నష్టపరిహారం విషయంలో తుది నిర్ణయం తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ ప్రాంతంలో ఉన్న ధరలను నిర్ణయించాలని రైతులు పట్టుబడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సేకరణకు సంబంధించి చట్టాల పరిధిలో వివిధ మార్గాలను రైతుల ముందుంచి పలు దఫాలుగా ధరలను నిర్ణయించినా నేటికీ కొలిక్కి రాలేదు. ఎట్టకేలకు జనరల్ అవార్డు కింద ఎకరాకు రూ.98 లక్షలుగా నిర్ణయించడానికి అధికార యంత్రాంగం సన్నద్ధమైనట్టు తెలుస్తోంది. భూములను కోల్పోతున్న రైతులు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం అంగీకరించలేదు. భూమికి బదులు భూమి ఇవ్వాలని తొలిదశలో డిమాండ్ చేసినా ప్రభుత్వం ఒప్పుకోలేదు. వందేండ్ల చరిత్ర కలిగిన గ్రామదేవతగా గ్రామస్తులు భావిస్తున్న చెట్టు రన్‌వేకు అడ్డంగా ఉండగా, దాన్ని తొలగించొద్దని గ్రామస్తులు కోరుతున్నారు. దాంతో ఈ వృక్షాన్ని తరలించడానికి రూ. పది లక్షలు ఖర్చు కానుంది. మామునూరు నుంచి గుంటూరుపల్లికి రహదారి రన్‌వేలో పోతుండటంతో ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు కోరారు.

ఆటోమేటెడ్ జనరేటర్లను సమకూర్చుకోవాలి



- మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనరేటర్ సౌకర్యం లేని ఆస్పత్రుల్లో ఆటోమేటెడ్ జనరేటర్లను సమకూర్చుకోవాలనీ, విద్యుత్ నిర్వహణ కోసం తాత్కాలిక పద్ధతిలో ఎలక్ట్రికల్ ఇంజినీర్లను నియమించుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరంతర విద్యుత్తు సరఫరాపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉత్పత్తి జనరేటర్ ల పనితీరు వాటి సామర్థ్యంపై చర్చించారు. విద్యుత్ సరఫరాకు అవసరమైన అత్యవసర పరికరాలను, సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి సూచించారు. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రిలో నిరంతరం విద్యుత్తు సరఫరా జరిగేలా జిల్లా వైద్య శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని కోరారు.

కోవిడ్ కిట్లనూ కొనుగోలు చేయాలి

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యాలతో పాటు కోవిడ్ టెస్ట్ కిట్స్‌ను, అవసరమైన మందులను కొనుగోలు చేయాలని టీజీఎంఎస్ఐడీసీ అధికారులను మంత్రి ఆదేశించారు. అధికారులు సమన్వయం చేసుకొని పారిశుధ్యతపై ప్రత్యేక దష్టి సాధించాలన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో మందుల కొరత లేకుండా లేకుండా అవసరమైన మందులను కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చొంగ్తు, ఎస్పీడీసీఎల్ ఎండి ముష్రఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ ఎండి వరుణ్ రెడ్డి, టీజీఎమ్మెస్ఐడిసి ఎండి ఫణిందర్ రెడ్డి, కాళోజి నారాయణరావు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నందకుమార్ రెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు.

'ఎర్రగడ్డ' ఘటనపై ఐదుగురితో కమిటీ

- మంత్రి దామోదర రాజనర్సింహ్మా
- డ్యూటీ ఆర్ఎంఒ పద్మజపై సస్పెన్షన్ వేటు
- ల్యాబ్ రిపోర్టులు వచ్చాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో మొత్తం 392 మంది రోగులకుగాను ఫుడ్ పాయిజన్ ఘటనలో 92 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైనట్టు నిర్ధారించారు. ఇప్పటికే ఒకరు మృతి చెందగా.. 18 మందికి ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. మిగతా 74 మంది ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోనే ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నుంచి వచ్చిన వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. బుధవారం ఉదయం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా ఆస్పత్రిని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ అయిన సమయంలో డ్యూటీలో ఉన్న ఇన్‌చార్జి సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ పద్మజను విధుల నుంచి తొలగించి ఆమెను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ వెల్ఫేర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఉస్మానియా జనరల్ ఆస్పత్రి సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ బి.శంకర్‌కు ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి ఇన్‌చార్జి సివిల్ సర్జన్ ఆర్ఎంగా బాధ్యతలు అప్పగించారు. కాంట్రాక్టర్ జి.జైపాల్‌రెడ్డి నిర్లక్ష్యం కారణంగానే ఫుడ్ పాయిజన్ జరిగినట్టుగా గుర్తించి ఆస్పత్రిలో డైట్ కాంట్రాక్టును రద్దు చేసి చెస్ట్ ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌కు తాత్కాలికంగా అప్పగించారు.

సూపరింటెండెంట్‌పై మంత్రి రాజనర్సింహ్మా సీరియస్

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో ఫుడ్ పాయిజన్ ఘటనపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సీరియస్ అయ్యారు. ఆస్పత్రిని సందర్శించిన మంత్రి సిబ్బందితో మాట్లాడి ఫుడ్ పాయిజన్ ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పెషల్ ఫుడ్ వల్లే రోగులు అస్వస్థతకు గురయ్యారని మంత్రి చెప్పారు. వెంటనే డైట్ కాంట్రాక్టర్ కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫుడ్ వల్లే రోగులు అస్వస్థతకు గురైనట్టు ప్రాథమికంగా గుర్తించినట్టు మంత్రి వెల్లడించారు. డైట్‌లో స్వీట్ ఏర్పాటు చేయడం వల్లే ఇలా జరిగి ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. ల్యాబ్ రిపోర్టు వచ్చిన అనంతరం కారణాలను పూర్తి స్థాయిలో వెల్లడిస్తామని చెప్పారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 18 మంది రోగుల పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనలో మృతిచెందిన కిరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని, ల్యాబ్ రిపోర్ట్‌ల ఆధారంగా త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని అన్నారు. మానసిక వైద్యశాలలో అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఐదు మంది సభ్యులతో కూడిన కమిటీని వేసి పరిస్థితిని పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఏ స్థాయి ఉద్యోగులైనా చర్యలు తీసుకునేందుకు ఉపేక్షించబోమని మంత్రి హెచ్చరించారు.

ఫుడ్ పాయిజనా..? కలుషిత నీరా..?

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 2న ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చక్కెర పరమాన్నం చేశారు. దీంతోపాటు అన్నం, కూర, అరటి పండ్లు, గుడ్లను కూడా రోగలకు వడ్డించారు. ఆస్పత్రిలో నల్లా నీటిని ఆర్వో ప్లాంట్లకు పంపి వాటి ద్వారా రోగులకు సరఫరా చేస్తున్నారు. స్టీలు బిందెల్లో పట్టిన ఆ నీటిని రోగులు గ్లాసులతో ముంచుకుని తాగుతుంటారు. ఈ రెండు నమూనాలను ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నుంచి వచ్చిన మైక్రోబయాలజీ బృందం సేకరించి పరీక్షల నిమిత్తం ఐపీఎంకు పంపించారు.

అమెరికా చేతిలో ప్రధాని కీలుబొమ్మ

- సీతారామ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలి
- బహుళ జాతి సంస్థల చేతుల్లోనే విత్తనాల తయారీ
- పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలి : పోతినేని సుదర్శన్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా అధ్యక్షులు ట్రంప్ చేతిలో భారత ప్రధాని నరేంద్ర మోడీ కీలుబొమ్మగా మారారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల గ్రామంలో డివిజన్ నాయకులు దొండపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ రైతు సదస్సులో ఆయన పాల్గొన్నారు. ముందుగా రైతు సంఘం జెండాను పోతినేని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలన్నారు. పంటలకు కనీసం మద్దతు ధర చట్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. విత్తనాల తయారీ బహుళ జాతి సంస్థల చేతుల్లోకి వెళ్లిందని, దీనివల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ప్రధాని మోడీ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ, ఎకరం 15 రూపాయల చొప్పున 5000 ఎకరాలను కారు చౌకగా అదానికి కట్టబెట్టిందని విమర్శించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వేలు అదానీకే అందేలా చేస్తున్నారని అన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు జరిగితే రైతులకు లాభం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేసే వరకు రైతు సంఘాలు ఐక్యంగా పోరాడి విజయం సాధించాయన్నారు. 450 గ్రాముల పత్తి విత్తనాల ప్యాకెట్‌కు రూ.70 పెంచి, 100 కేజీల ధాన్యానికి మాత్రం రూ.69 మాత్రమే మద్దతు ధర పెంచి.. ధర పెంచామంటూ కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని తెలిపారు. మిర్చిని మార్కెట్లలో రూ.13 వేలకు కొనుగోలు చేస్తుంటే కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ రూ.10,500 మాత్రమే కొనుగోలు చేయాలని ప్రకటించటం దారుణమన్నారు.

పహల్గాంలో 26 మంది పర్యాటకలను పొట్టను పెట్టుకున్న నలుగురు ఉగ్రవాదులను ఇంతవరకు ఎందుకు పట్టుకోలేదనికేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉగ్రవాదుల స్థావరంగా ఉన్న పాకిస్థాన్‌పై యుద్ధం ఎందుకు ప్రారంభించారో, ఎందుకు నిలిపివేశారో ప్రధానమంత్రి దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు లొంగి యుద్ధాన్ని ఆపారని అన్నారు. సీతారామ ప్రాజెక్టును బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నాలుగుసార్లు శంకుస్థాపనలు చేశారని విమర్శించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయటం లేదో జిల్లా రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టు వల్లే జిల్లా వ్యవసాయ రంగం సస్యశ్యామలం అవుతుంద న్నారు. భవిష్యత్తులో రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షులు చింతలచెరువు కోటేశ్వరరావు తదితరులు ఊపాల్గొన్నారు.



రైతు సదస్సులో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్ రావు

రాజకీయ ఉనికి కోసమే కవిత పోరాటం

- బిఆర్ఎస్‌లో గొడవలు టీ కప్పులో తుపాను
- ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పొన్నం
- ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించిన మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ ఉనికి కోసమే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాటం చేస్తున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బిఆర్ఎస్‌లో నెలకొన్న గొడవలు టీ కప్పులో తుఫాన్ లాంటివని ఆయన చెప్పారు. అనివార్య కారణాలతో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరాగాంధీభవన్‌లో మంత్రి పొన్నం తిరిగి కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యకర్తల నుంచి పలు విజ్ఞప్తులను స్వీకరించారు.

కొన్ని సమస్యలపై వెంటనే స్పందించారు. అధికారులతో మాట్లాడి ఆ సమస్యకు పరిష్కారం చూపించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి, భూసంబంధ సమస్యలు, ఉద్యోగ బదిలీలు... ఇలా అనేక సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎఐసిసి ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు ప్రభుత్వం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం ముఖాముఖి కార్యక్రమం పునఃప్రారంభించామన్నారు. ప్రజాభవన్‌లో ప్రజాసమస్యలకు సంబంధించిన విజ్ఞప్తులను తీసుకుంటూనే... గాంధీభవన్‌లో కార్యకర్తలు, నాయకుల సమస్యలను తెలుసుకుంటున్నామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన కార్యకర్తల సమస్యలను పట్టించుకోవాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. అందులో భాగంగా నాయకులు, కార్యకర్తలతో మంత్రులు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందరమ్మ ఇళ్లు పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన 'ముఖాముఖి' కార్యక్రమానికి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. తమ సమస్యలను వివరించారు.

బి ట్యాక్స్ 20 శాతానికి పెంపు

- ఇవ్వకుంటే బిల్లులిస్తలేరని కాంట్రాక్టర్ల మొర
- క్యాబినెట్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగాలి
- వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి : మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇప్పటిదాకా తీసుకున్న పది శాతం బి ట్యాక్స్‌ను 20 శాతానికి పెంచారని బిజెపి ఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. అది చెల్లించనిదే పెండింగ్ బిల్లులు విడుదల చేయడం లేదని కాంట్రాక్టర్లు తమ వద్ద మొర పెట్టుకుంటున్నారన్నారు. అవి చెల్లించలేని స్థితిలో ఉన్నారు కాబట్టే మాజీ సర్పంచులకు రూ.1000 కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించడం లేదేమోనని సందేహం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాలేజీలు మూతపడుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయరా? అని ప్రశ్నించారు. యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుంటే పిల్లల తల్లిదండ్రులు తమ బంగారం తాకట్టు పెట్టి ఫీజులు కడుతున్న విషయాన్ని ఎత్తిచూపారు. 42 శాతం బిసి రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వమిచ్చిన హామీలను నెరవేర్చాలనీ, ప్రజా సమస్యలను పరిష్కరించాలని పోరాటం చేస్తామని ప్రకటించారు. యువతకు, రైతులకు, మహిళలకు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని విమర్శించారు. ఇంకా 35 శాతం రైతు రుణమాఫీ కాలేదని ఎత్తిచూపారు. మొత్తం పూర్తయిందని ప్రకటించడం అన్నదాతలను మోసం చేయడమే అవుతుందన్నారు. పింఛన్ మొత్తాన్ని రూ.నాలుగు వేలకు పెంచుతామని, వికలాంగులకు ఇస్తున్న నెలకు రూ.నాలుగు వేల మొత్తాన్ని రూ.ఆరు వేలకు పెంచుతామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికకు గైడ్‌లైన్స్ ఖరారు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు క్యాబినెట్‌కు పట్టవా? అని నిలదీశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిలను విడుదల చేయడంపై క్యాబినెట్ నిర్ణయం తీసుకోవాలని కోరారు. స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామీణ పాలనా వ్యవస్థ, అభివృద్ధి కుంటుపడ్డాయని వాపోయారు. వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. క్యాబినెట్‌లో ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించాలని కోరారు.

డాక్టర్ నాగేశ్వరరావు 'కోనర్-ఎంఎఫ్'కు యుఎస్ పేటెంట్

- గుండె లోపాల చికిత్సలో మరో మైలురాయి
- రూ.50 వేలకు పరికరం

ప్రజాశక్తి - హైదరాబాద్



హైదరాబాద్ నగరంలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ కన్సల్టెంట్, పీడియాట్రిక్ కార్డియాలజీ విభాగ అధిపతి డాక్టర్ కోనేటి నాగేశ్వరరావు తాను రూపొందించిన వినూత్న పరికరం కోనర్-ఎంఎఫ్ (మల్టీఫంక్షనల్) ఆక్లూడర్‌కు యునైటెడ్ స్టేట్స్ పేటెంట్‌ను అందుకున్నారు. ఈ పరికరం పిల్లలు, పెద్దలలో గుండెలోని సెప్టల్ లోపాలను సరిచేయడానికి ఎంతో ఉపయోగపడనుంది. ఇది ఆయన జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. 2021 నుండి 2023 మధ్య భారత్, యూరప్, యూరో-ఆఫ్రికా దేశాలు, దక్షిణ కొరియాలో ఇప్పటికే పేటెంట్లు మంజూరయ్యాయి. ఫిబ్రవరి 2023లో భారత పేటెంట్, ఎన్నో కఠినమైన క్లినికల్, సాంకేతిక పరీక్షల అనంతరం లభించింది. రూ.50,000కే లభ్యమయ్యే కోనర్-ఎంఎఫ్ ఆక్లూడర్, దీర్ఘకాల క్లినికల్ అవసరాలను పూర్తి చేస్తూ, వివిధ రకాల లోపాలను పరిష్కరించేందుకు అనుకూలమైన చికిత్సా విధానాన్ని అందిస్తుందని డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. సిస్టమిక్-టు-పల్మనరీ ఆర్టరీ కొలాటరల్స్ వంటి అనేక సమస్యలను పరిష్కరించనుందన్నారు. ఈ పరికరం సమస్యల ప్రమాదాన్ని తగ్గించి, రోగి త్వరగా కోలుకునేందుకు అవసరమైన ఫలితాలను అందిస్తుందన్నారు. అతి తక్కువ ధరలో లభ్యమయ్యే ఈ పరికరం సహజసిద్ధ గుండె లోపాల భారాన్ని తగ్గించడంలో, చికిత్సను విస్తరించడంలో కీలక సాధనంగా నిలుస్తుందన్నారు. "భారత్‌లో రూపొందించిన ఆవిష్కరణలు అత్యున్నత ప్రపంచ ప్రమాణాలను అందుకోగలవు. ప్రపంచ వ్యాప్తంగా రోగులకు అవసరమైన వైద్య సేవ చేయగలవని ఇది నమ్మకాన్ని కలిగించింది. ఈ గుర్తింపు పీడియాట్రిక్ కేర్‌లో అందరికీ అందుబాటులో ఉండి మరింత విస్తరింపగలిగే పరిష్కారాల కోసం నిరంతరం పనిచేయడానికి ప్రేరణనిస్తుంది." అని నాగేశ్వర రావు తెలిపారు.

7SEAS
ENTERTAINMENT LTD

7సీస్ నుంచి మూడు కొత్త గేమ్స్

- క్రికెట్, గుర్రపు స్వారీ, కేక్ మ్యాచ్‌ల ఆవిష్కరణ
- ఆన్‌లైన్ రియల్ గేమ్స్.కమ్ సైట్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ లిస్టెడ్ గేమింగ్ కంపెనీ 7సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ కొత్తగా మూడు గేమ్స్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఇందులో వరల్డ్ క్రికెట్ ఛాంపియన్స్ లీగ్, హార్స్ వరల్డ్ రైడ్, కేక్ మ్యాచ్, పజిల్ సార్ట్ గేమ్ అనే మూడు గేమ్‌లు ఉన్నాయని తెలిపింది. తన వెబ్‌సైట్ ఆన్‌లైన్‌రియల్‌గేమ్స్.కమ్‌లో వీటిని తిరిగి ప్రారంభించినట్లు ఆ సంస్థ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. ఇవి ప్లే స్టోర్, యాప్ స్టోర్, ఇండస్ యాప్‌స్టోర్‌లలో ఉచితంగా అందుబాటులో ఉంటాయని తెలిపింది. ఆవిష్కరణ, సృజనాత్మకతతో నిండిన భారతీయ గేమింగ్ ప్రపంచాన్ని ప్రదర్శించడం, పరికరాల్లో ఆటగాళ్లకు అధిక-నాణ్యత గేమింగ్ అనుభవాన్ని అందించడం దీని లక్ష్యమని వెల్లడించింది. గేమర్‌ల కోసం విస్తృత శ్రేణి గేమ్‌లతో స్నేహపూర్వక అనుభవాన్ని అందించడానికి ఒక ప్రత్యేకమైన ప్లాట్‌ఫామ్‌ను రూపొందించడానికి అత్యంత ప్రజాదరణ పొందిన ఫ్రీ-టు-ప్లే క్యాజువల్ గేమింగ్ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌రియల్‌గేమ్స్.కమ్‌ను తిరిగి ప్రారంభించామని 7 సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్ఎం శంకర్ తెలిపారు. 150 పైగా వెబ్ ఆధారిత గేమ్‌ల సేకరణను అందిస్తుందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి గేమ్ లైబ్రరీని రెట్టింపు చేయాలనే ప్రణాళికలతో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న గేమర్‌లకు మరింత గొప్ప అనుభవాన్ని అందించడానికి తమ వేదిక సిద్ధంగా ఉందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 25 శాతం అడ్మిషన్లు పెంచండి

- స్కూళ్లలో మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ బెల్స్ మోగించాలి
- మహిళా శిశు సంక్షేమ శాఖ మేధో మథన సదస్సులో మంత్రి డాక్టర్ సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ కేంద్రాల్లో 25 శాతం అడ్మిషన్లు పెంచేలా ప్రతి అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ కృషి చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) కోరారు. త్వరలో 14 వేల అంగన్‌వాడీ సిబ్బంది పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే మినీ అంగన్‌వాడీలకు ప్రధాన టీచర్లుగా ప్రమోషన్లు కల్పించామనీ, రిటైర్డ్ బెనిఫిట్స్ ప్రకటించామని గుర్తుచేశారు. జీపీ సిబ్బందికి మాదిరిగానే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల జీతాలను గ్రీన్ ఛానల్‌లో అందించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మేదో మథన సదస్సు- 2025 నిర్వహించారు. అందులో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి సీతక్క పరిశీలించారు. బాలామృతాన్ని ప్యాకెట్లలలో కాకుండా బాక్సుల్లో ఇవ్వాలని ఆదేశించారు. ప్రీస్కూల్ వీడియోను విడుదల చేశారు. అనంతరం సదస్సులో మంత్రి సీతక్క మాట్లాడుతూ.. స్కూళ్లలో మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో బెల్ కొట్టాలని సూచించారు. దాని ద్వారా చిన్నారుల్లో క్రమశిక్షణ, ఉత్సాహం పెరుగుతాయనీ, సిబ్బంది సకాలంలో డ్యూటీకి వచ్చేందుకు దోహదపడుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న విద్య, ఆరోగ్య భద్రతను మెరుగుపరుచుకునే లక్ష్యంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాల వారీగా నివేదికలివ్వండి

ఇప్పటివరకూ చేసిన పనులు, వాటి పురోగతిపై జిల్లాల వారీగా నివేదికలు సమర్పించాలని అధికారులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో పనుల పురోగతి, పెండింగ్ అంశాలపై మంత్రి సమీక్షించారు.



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు రావి నారాయణరెడ్డి 118వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన సభలో ఆయనకు నివాళులర్పించిన టిజెఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం.

రావి నారాయణరెడ్డి జయంతి వేడుకలు

- నివాళులర్పించిన కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి 118వ జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్యోతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతరాజు ఉప్పలయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రి శ్రీమాన్, సిపిఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గోవిందు, నాయకులు బోయ శ్రీరాములు, అంజయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమెరికాకు మోడీ లొంగిపోయారు

- మాజీ ఎంపి విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలకు ప్రధాని మోడీ లొంగిపోయారని మాజీ ఎంపి వి హనుమంతరావు విమర్శించారు. దేశంలోని రాజకీయ పార్టీలు, పౌరులు మోడీకి మద్దతుగా నిలబడినా... ట్రంప్ మాటను గౌరవించి ఆపరేషన్ సిందూర్‌ను ఆపేశారని విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మన దేశం ఏం చేసినా ఆ ఘనత మనకే రావాలి తప్ప అమెరికాకు కాదని స్పష్టం చేశారు. ట్రంప్ చెప్పినట్టు విని యుద్ధాన్ని ఎలా ఆపేస్తారంటూ ఆయన ప్రశ్నించారు.

మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోండి

- ప్రభుత్వానికి ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని టిజిఎస్ ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆర్‌టిసిలో తక్షణం వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి, కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ కే హన్మంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎమ్ థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎమ్‌డీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బీ యాదగిరి ఆ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలనీ, విద్యుత్ బస్సుల్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్‌టిసిలకు ఇవ్వాలనీ, వేతన సవరణ చేయాలనీ, పాత వేతన సవరణ బకాయిలు చెల్లించాలనీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్‌టిసి ఉద్యోగుల జీతాలు సవరించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ నియమకాలు ఎత్తేసి, ప్రభుత్వమే నేరుగా రిక్రూట్‌మెంట్లు చేయాలని పేర్కొన్నారు.

మ్యానిఫెస్టో అంశాలు అమలు చేయాలి

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను ప్రస్తుత మంత్రివర్గ సమావేశంలో చర్చించి, ఆమోదం తెలపాలని టిజిఎస్ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) బుధవారంనాడొక పత్రికా ప్రకటనలో పేర్కొంది. గురువారం జరిగే మంత్రివర్గ సమావేశ నిర్ణయాలపై ఆర్‌టిసి కార్మికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి, వైస్ చైర్మన్ జీ అబ్రహం తెలిపారు.



త్యాగరాయ గానసభకు అరవై ఏళ్లు

- కళా ప్రదర్శనలతో నిత్యం కళామయం
- జస్టిస్ కాశీ విశ్వేశ్వర్‌రావు

ప్రజాశక్తి కల్చరల్

పలు రంగాలలో ప్రముఖులు చిత్ర పటాలు ఆడిటోరియం లో ఏర్పాటు తో పాటు ఏడు వేదికల్లో కళా ప్రదర్శనలు తో నిత్యం కళామయం రూపొందిందని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు అన్నారు.

ఎందరో మహానుభావులు పేరిట గత కాలపు ప్రఖ్యాతులు స్మరిస్తూ చేస్తున్న కార్యక్రమాలు అపురూపం అని అన్నారు శ్రీ త్యాగరాయ గాన సభ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం చిక్కడపల్లి ప్రముఖ గాయని సంయుక్త ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి కీర్తనలు, కర్ణాటక సంగీత కార్యక్రమం గాన సభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం సంయుక్త ను సత్కరించిన అనంతరం జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ఆరు దశాబ్దాల పైగా గాన సభ ప్రస్థానం లో కళా సుబ్బారావు, కళా దీక్షితులు, అనంతరం ప్రస్తుత అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి కృషి చేశారని అభినందించారు. కులమతాలకు అతీతంగా ఉచితంగా వివాహానాల నిర్వహణకు శ్రీకారం చుట్టడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. దీంతో పాటు శాస్త్రీయ, కర్ణాటక సంగీతాన్ని ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం విశేషమని అన్నారు. ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించడం కళాకారులను, కళలను ప్రోత్సహించిట్లవుతుందని అన్నారు. కార్యక్రమంలో గానసభ పాలక మండలి సభ్యులు గుండవరపు గీతాదేవి, శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త చోటుకు ఎఎస్ రావు నగర్ మలబార్ షోరూం

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ నగరంలోని ఎఎస్ రావు నగర్‌లోని తన షోరూంను అదే ప్రాంతంలోని రాధిక ఎక్స్ రోడ్ ప్రాంతానికి మార్చింది. 13,473 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఈ విశాలమైన షోరూంను బుధవారం లాంచనంగా ప్రారంభించింది. మలబార్ మేనేజ్‌మెంట్ బృందం, వినియోగదారుల సమక్షంలో ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మ రెడ్డి, ఎఎస్‌రావు నగర్ కార్పొరేటర్ శిరీష రెడ్డి కొత్త షోరూంను ప్రారంభించారు. ప్రాముఖ్యత కలిగిన ప్రాంతంలో షోరూమును ఏర్పాటు చెయ్యడం, ప్రపంచ స్థాయి సేవలు అందించడం, సాటిలేని ఉత్పత్తి వైవిధ్యాన్ని ప్రదర్శించడం వంటి ఎన్నో అంశాలు ఒకే షోరూములో లభించేలా చెయ్యడం, మలబార్ నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆ సంస్థ పేర్కొంది.

ఆగస్టు 19-22 వరకు సిపిఐ రాష్ట్ర మహాసభ

- జయప్రదం చేయండి : ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆగస్టు 19 నుంచి 22 వరకు సిపిఐ రాష్ట్ర మహాసభ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లోని మహారాజ గార్డెన్‌లో జరగనుంది. ఈ నేపథ్యంలో బుధవారం కుత్బుల్లాపూర్ షాపూర్‌నగర్ ఎఐటియుసి కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్.బోస్ అధ్యక్షతన ఆహ్వాన సంఘం కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభ నిర్వహణకు ఆతిథ్యం ఇచ్చిన పార్టీ మేడ్చల్ జిల్లా కమిటీకి అభినందనలు తెలిపారు. రాష్ట్ర మహాసభకు జాతీయ నేతలు, అన్ని జిల్లాల నుంచి దాదాపు వెయ్యి మంది పార్టీ ప్రతినిధులు హాజరు కానున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై, రాజ్యాంగం కల్పించిన పౌరుల ప్రాథమిక హక్కులపై చర్చలు జరిపి తీర్మానాల రూపంలో భవిష్యత్ పోరాటాల రూపకల్పనకు మహాసభ వేదిక కానుందన్నారు. మహాసభల విజయవంతానికి ప్రజల నుంచి సహాయ సహకారాలు తీసుకుని, వారిని భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, అమాయక గిరిజనులను హతమారుస్తున్నదని, తక్షణమే కగార్‌ను నిలిపేయాలని డిమాండ్ చేశారు. పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో 27 మందికిపైగా మరణించారని, ఇప్పటి వరకు ఆ దుండగులను కేంద్రం పట్టుకోలేకపోయిందని అన్నారు. పాకిస్థాన్‌తో భారత్ యుద్ధాన్ని ఆపానన్న అమెరికా అధ్యక్షులు ట్రంప్ మాటలను బట్టి ప్రధాని మోడీ మన దేశాన్ని ట్రంప్‌కు తాకట్టు పెట్టారని తెలుస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ, సిపిఐ సీనియర్ నేత పిజె.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభ నిర్వహణ అంటే పార్టీ నూతనోత్సాహానికి, పార్టీ ఎదుగుదలకు తార్కాణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసుఫ్, ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎం.నర్సింహా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డిజి.సాయిలు గౌడ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ.ఉమామహేష్, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు యేసు రత్నం, జి.దామోదర్ రెడ్డి, జె లక్ష్మీ, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ధర్మేంద్ర, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు